సాగర తీరం..
ఫుట్‌పాత్‌లు హీనం

కానరాని మరమ్మతులు.. పట్టించుకోని అధికారులు



బీచ్ రోడ్డులో పలకలు ఊడిన ఫుట్‌పాత్

బీచ్ రోడ్డులో కాలిబాటలు శిథిలం

పలకలు విరిగి అధ్వానంగా దర్శనం

ఇబ్బంది పడుతున్న సందర్శకులు

ఏయూక్యాంపస్: నిత్యం వేలాది మంది పర్యాటకులు తరలివచ్చే విశాఖ సాగర తీరంలో వసతులు నానాటికి తీసికట్టుగా మారిపోతున్నాయి. బీచ్ రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళల్లో అనేక మంది వాకింగ్ చేసే ఫుట్‌పాత్‌లు పలు చోట్ల విరిగిపోయి, కంపు కొడుతూ దర్శనమిస్తున్నాయి. వీటి నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో బీచ్ రోడ్డులోని ఫుట్‌పాత్‌లు నిర్లక్ష్యానికి నిదర్శనంగా.. సందర్శకులకు ప్రమాదకరంగా మారాయి.

శిథిలమవుతున్న ఫుట్‌పాత్‌ల పలకలు

బీచ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై వేసిన రంగుల పలకలు అనేక చోట్ల శిథిలమయ్యాయి. కొన్ని చోట్ల లోపలకి కుంగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. అనేక చోట్ల పలకలు పైకి లేచి, సిమెంట్‌తో సహా బయటకు కనిపిస్తున్నాయి. వీటికి చాలా కాలంగా మరమ్మతులు చేయక పోవడం, కొత్తవాటిని వేయడం వంటివి చేయలేదు. సాయంత్రం వేళల్లో నగర సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఇక్కడి ఫుట్‌పాత్‌లు అసౌకర్యంగా నిలుస్తున్నాయి.

కంపు కొడుతున్నాయి..

సముద్ర తీరం వైపు ఉండే ఫుట్‌పాత్‌లన్నీ కంపు కొడుతున్నాయి. వీటిపై ఉదయం, సాయంత్రం వేళల్లో వర్తకులు తినుబండారాలను విక్రయిస్తారు. వీరు తమ దుకాణాలు, షాపుల కింద ప్లాస్టిక్ పరదాలు పరవాల్సి ఉంది. వీరు ఎటువంటి పరదా వేయకుండా నేరుగా విక్రయాలు చేస్తున్నారు. దీంతో తినుబండారాలు ఫుట్‌పాతులపై పడటం, అవి నల్లగా మారిపోవడం జరుగుతోంది. వీటిని హై ప్రెజర్ కలిగిన వాటర్ పైపులతో శుభ్రం చేయాల్సి ఉంది. ఈ దిశగా జీవీఎంసీ అధికారులు ఆలోచన సైతం చేయడం లేదు. ఉదయం వేళలో వాకింగ్‌కి వచ్చే వారు ఇక్కడ కూర్చోవాలంటే ఇబ్బంది పడుతున్నారు. కుక్కలు, పశువులు సైతం పచ్చికబయళ్లలో సంచరిస్తూ కనిపిస్తున్నాయి. నిత్యం ఉదయం వేళల్లో ఫుట్‌పాత్‌లపై పశువ్యర్థాలు ఇబ్బందిగా మారుతున్నాయి.

ప్రమాదకరంగా ఇనుప ఊచలు

ఆర్కే బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా గతంలో విద్యుత్ స్తంభాల కోసం వేసిన ఇనుప ఊచలు బయటకు చొచ్చుకువస్తున్నాయి. రాత్రివేళల్లో ఇవి కనిపించక పలువురు గుద్దుకుని గాయాల బారిన పడుతున్నారు. వీటి చుట్టూ కాంక్రీట్ పోయడం, లేదా వీటిని తొలగించడం చేయాలి. ఇలా చేయక పోవడంతో పక్కనే ఉన్న దుకాణదారులు వీటిపై ఫుట్‌పాత్‌పై వేసే పలకలను ఉంచారు.

అధికారులు చొరవ చూపాలి

వైఎంసీఏ నుంచి ఆర్కే బీచ్ వరకు రెండు వైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు అనేక చోట్ల శిథిలమవడమే కాకుండా గోతులు పడుతున్నాయి. నిత్యం ఈ మార్గంలో వందలాది మంది వృద్ధులు వాకింగ్ చేస్తుంటారు. ప్రమాదవశాత్తు వీరు ఈ గోతుల్లో పడితే గాయాల పాలయ్యే అవకాశం ఉంది. సత్వరం జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. బీచ్ రోడ్డులోని కాలిబాటలను నిత్యం శుభ్రం చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.



పలకలు విరిగి అధ్వానంగా తయారైన ఫుట్‌పాత్



ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా ఇనుప ఊచలు



విరిగిన ఫుట్‌పాత్ పలకలు



సాగర తీరం వద్ద శిథిలమైన ఫుట్‌పాత్



క్లుప్తంగా

ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్యకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఏయూ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్యకు 2024 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన ఐఎస్‌టీఈ నేషనల్ బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని పంజాబ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారామ్‌లు లామ్రిన్ టెక్ స్కిల్ యూనివర్సిటీ (రోపర్, పంజాబ్)లో జరిగిన 54వ ఐఎస్‌టీఈ నేషనల్ వార్షిక ఫ్యాకల్టీ కాన్వెన్షన్‌లో ఆయనకు అందజేశారు. ఆచార్య వెంకట సుబ్బయ్య వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రొఫెషనల్ బాడీల్లో ప్రాధాన్యమైన నాయకత్వాన్ని, శాస్త్రీయ పరిజ్ఞానంలో చేసిన కృషిని గుర్తిస్తూ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సోమవారం వెంకట సుబ్బయ్యకు ఏయూ ఆచార్యులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

టీఎఫ్‌సీలో ఆహార తనిఖీలు



ఫుడ్ కోర్ట్‌లో తనిఖీ నిమిత్తం సేకరిస్తున్న రసమలై స్వీట్ శాంపిల్

బీచ్‌రోడ్డు: పలువురు ఆహార ప్రియులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొమ్మాది టీఎఫ్‌సీలో తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలిలా.. కొమ్మాది జంక్షన్‌లోని ట్రీట్స్ ఫుడ్ కోర్ట్(టీఎఫ్‌సీ)లో పాడైన స్వీట్లు విక్రయిస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారి ఆనంద్‌ను తనిఖీల నిమిత్తం టీఎఫ్‌సీకి పంపించారు. అక్కడ ఆయన రసమలై స్వీట్ శ్యాంపిల్‌ను సేకరించారు. దీనిని నాణ్యత పరీక్షల నిమిత్తం ఆహార పరీక్షల కేంద్రానికి పంపారు. నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని నందాజీ పేర్కొన్నారు.

విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంపొందించాలి



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న అధ్యాపక బృందం

మద్దిలపాలెం: విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంపొందించేందుకు దోహదపడే ప్రయోగాలను ఎప్పటికప్పుడు చేయించాలని గీతం అసోసియేట్ ప్రొఫెసర్ బగ్గం స్పందన సూచించారు. మద్దిలపాలెంలోని రాణీ మెమోరియల్ స్కూల్‌లో సోమవారం కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ముఖ్య అతిథిగా ఆమె ప్రారంభించారు. సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. రాణీ మెమోరియల్ స్కూల్ వ్యవస్థాపకుడు రంగారావు, ప్రిన్సిపాల్ ఝాన్సీ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు సైన్స్‌పై సరైన అవగాహన కల్పిస్తాయన్నారు. రాణీ మెమోరియల్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను గీతం అధ్యాపక బృందం, విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు.

23న రక్తదాన శిబిరం

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా బాడీలిఫ్టింగ్ సంఘం కార్యనిర్వహణ కార్యదర్శి కిలాని చిరంజీవి జ్ఞాపకార్థం ఈ నెల 23న స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆంధ్ర రాష్ట్ర బాడీలిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్ పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రామాటాకీస్ సమీపాన గల వాయిపుత్ర హెల్త్‌క్లబ్ ఆవరణలో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్వచ్ఛంద రక్తదానం చేయడానికి సేవా దృక్పథంతో ముందుకు రావాలని, ప్రతి ఏడాది రెండు సార్లు హెల్త్‌క్లబ్ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 88852 03519 నంబరులో సంప్రదించవచ్చు.

ఆచార్యా.. వజ్రోత్సవాలు ఇలాగేనా?



మాట్లాడుతున్న సైంటిస్ట్ కె.ఎస్.ఆర్.మూర్తి



సెమినార్ హాల్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినమ్ జూబ్లీ సెలబ్రేషన్స్ పేరిట వైవీఎస్ ఆడిటోరియంలో సోమవారం జాతీయ సెమినార్ అట్టహాసంగా ప్రారంభమైంది. వర్సిటీ శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినమ్ సెలబ్రేషన్స్‌కు అధికారులు విస్తృత ప్రచారం చేపట్టారు. రెండు రోజుల పాటు జాతీయ సెమినార్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. వర్సిటీ అధికారుల పిలుపుతో వివిధ ప్రాంతాల విద్యావేత్తలు, సైంటిస్టులు, నిష్ణాతులైన సాంకేతిక నిపుణులు సెమినార్‌కు హాజరయ్యారు. ప్రారంభ వేడుకపైనే ఫోకస్ అంతా పెట్టిన నిర్వాహకులు, శాస్త్రవేత్తల ప్రసంగాలతో విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా తగిన శ్రద్ధ చూపలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. మధ్యాహ్నం తరువాత సెమినార్ తూతూ మంత్రంగానే సాగింది. ప్రముఖ జియోగ్రఫీ నిపుణుడు, సైంటిస్ట్ కె.ఎస్.ఆర్.మూర్తి సెమినార్‌లో తన అనుభవాలను పంచుకునే సమయంలో హాల్‌లో వినేవారు లేరు. కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. హాల్ బయట విద్యార్థులు కబుర్లతో కాలక్షేపం చేసినా.. వారిని లోపలకి రప్పించేందుకు నిర్వాహకులు శ్రద్ధ తీసుకోలేదు. జాతీయ స్థాయిలో నిర్వహించే సెమినార్‌కు వర్సిటీలోని వివిధ కోర్సులు అభ్యసించే విద్యార్థులను భాగస్వాములను చేస్తే హాల్ నిండుగా కనిపిస్తోంది. ఆ దిశగా వర్సిటీ అధికారులు చొరవ చూపలేనట్లు కనిపిస్తోంది. కొంతమంది వక్తలు సైతం తమ ప్రసంగాలను ఇవ్వకుండా మధ్యలోనే సెమినార్ నుంచి వెళ్లిపోయారు. మంగళవారం నాటి సెమినార్ అయినా, విద్యార్థులకు, ఔత్సాహికులకు ఉపయోకగరంగా ఉండేలా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తే బాగుటుందని పలువురు సూచిస్తున్నారు.

దివ్యశక్తిని జాగృతం చేస్తేనే జన్మ సార్థకత



ప్రవచిస్తున్న షణ్ముఖశర్మ

ఎంవీపీకాలనీ: మనిషిలోని దివ్యశక్తిని జాగృతం చేసినప్పుడే మానవ జన్మకు సార్థకత లభిస్తుందని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. రుషి పీఠం సత్సంగం శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని భద్రం పార్క్ వేదికగా శ్రీ మహా గణపతి వైభవం ప్రవచనాలు సోమవారం కొనసాగాయి. ఈ సందర్భంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ ఉపాసన, యోగా సాధన, ఆధ్యాత్మిక చింతనతో జీవుడిలోని దివ్యశక్తిని మేల్కొల్పడం ద్వారా మానవ జన్మకు సార్థకత లభిస్తుందని చెప్పారు. ఈ దిశగా ప్రతి ఒక్కరూ జాగృతం కావాలని సూచించారు. గణపతి ఆరాధనతో సిద్ధి, బుద్ధి లభిస్తాయన్నారు. తద్వారా క్షేమకరమైన, లాభదాయకమైన జీవితాన్ని పొందవచ్చని ప్రవచించారు. వేద, పురాణ, మంత్ర శాస్త్రాల సహిత శ్రీ మహా గణపతి వైభవాన్ని తన ప్రవచనాల ద్వారా విశదీకరించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు కె.వి.ఎస్.శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పర్యవేక్షించారు.

రహదారులిలా.. నడిచేదెలా..?



ఇందిరానగర్ రామాలయం వీధిలో రోడ్డు దుస్థితి

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో పలు రోడ్లు శిథిలావస్థకు చేరాయి. కొన్ని రహదారుల్లో గోతులు పడగా.. మరికొన్ని వీధుల్లోని రోడ్లు యూజీడీ మ్యాన్‌హోళ్లతో నడవడానికి సైతం ఇబ్బందికరంగా మారాయి. ఇందిరానగర్ రామాలయం వీధిలోని ఇరుకు సీసీ రోడ్డులో గతంలో యూజీడీ పనులు జరిగాయి. వాటిలో భాగంగా రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్స్ నిర్మించారు. అవి రోడ్డుకు అడుగు ఎత్తులో ఉండటం, వాటికి ఇరుపక్కలా రోడ్డు శిథిలమవడంతో అస్తవ్యస్తమై నడిచేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సచివాలయంలో సిబ్బందికి, స్థానిక కార్పొరేటర్, ఎమ్మెల్యేకు పలుసార్లు ఫిర్యాదు చేసినా.. ఇంతవరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

19, 20 తేదీల్లో వర్క్‌షాప్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న సైన్స్ అకాడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల సోమవారం ఆవిష్కరించారు. కళాశాల మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌లో పలువురు అధ్యాపకులు పాల్గొంటున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో కార్యక్రమ కో-ఆర్డినేటర్ జ్యోతి, మైక్రోబయాలజీ అధ్యాపకులు, బయోటెక్నాలజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఆర్‌జెడ్ నిబంధనలు అమలు చేయండి

ఏయూక్యాంపస్: తీర ప్రాంతంలో సీఆర్‌జెడ్ ఉల్లంఘనలు జరగకుండా చూడాలని నగరానికి చెందిన తెడ్డు శంకర్ కోరారు. బీచ్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ వ్యాపార అవసరాల కోసం సీఆర్‌జెడ్ పరిధిలో నూతనంగా ఆరు నుంచి ఎనిమిది బోర్లు తవ్వడాన్ని నిలిపివేయాలని కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లకు సోమవారం ఆయన విజ్ఞప్తి చేశారు. వాణిజ్య అవసరాల కోసం బోర్లు తీయడం నిషేధమని, దీనిని ఉల్లంఘిస్తూ వరుణ్ హాస్పిటాలిటీ లిమిటెడ్ నూతనంగా బోర్లు వేస్తోందని, దీనిని నిలపాలని కోరారు. వాణిజ్య సముదాయాలు, వాణిజ్య కార్యకలాపాల కోసం భూగర్భ జలాలను వెలికి తీయరాదని గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వేమన మందిరానికి సీల్..

ఎమ్మెల్యే ఒత్తిడి..కలెక్టర్ ఆదేశాలతో నిర్వాహకులకు తాళాలు అప్పగించిన అధికారులు



సీల్ వేస్తున్న జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది

డాబాగార్డెన్స్: వేమన మందిరానికి జీవీఎంసీ అధికారులు సోమవారం ఉదయం సీల్ వేశారు. ఒత్తిడి రావడంతో గంటలోనే సీల్ విప్పారు. వివరాలివి.. ఆశీల్‌మెట్టలోని వేమన మందిరాన్ని లీజుకు తీసుకుని 45 ఏళ్లు అయింది. ఏదీంతో జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది వేమన మందిరంలోని రూమ్‌లకు తాళాలు వేశారు. వెంటనే వేమన సంక్షేమ సంఘం ప్రతినిధులు నగరంలోని ఓ ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన నుంచి అధికారులకు ఫోన్లు వెళ్లాయి. దీంతో కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులకు ఫోన్ చేసి తక్షణమే వేమన మందిరాన్ని తెరవాలని ఆదేశించారు. దీంతో జీవీఎంసీ రెవెన్యూ అధికారులు సీల్ వేసిన రూమ్‌లు తెరిచి నిర్వాహకులకు అప్పగించారు.

సాగరంలోకి కలుషిత జలం



సముద్రంలో కలుస్తున్న మురుగు నీరు

ఏయూక్యాంపస్: నగరంలోని మురుగు నీరంతా సాగరంలోకి కలుస్తోంది. నగరంలోని వివిధ మురుగు కాలువల నుంచి వచ్చే వ్యర్థ జలాలను నేరుగా సముద్రంలోకి పైపులతో వదిలేస్తున్నారు. దీంతో నిత్యం వేల లీటర్ల మురుగు నీరు సముద్ర జలాల్లో కలిసిపోతున్నాయి. ఇవి సముద్ర వాతావరణానికి, సముద్ర జీవులకు ముప్పుగా మారుతున్నాయి. పాండురంగాపురం డౌన్‌లో కోకో ఎరీనా పక్కనే పైప్‌లైన్ నుంచి నిత్యం నీరు సముద్రంలోకి వెళ్తోంది. దీంతో ఈ ప్రాంతంలోని బీచ్ అంతా నల్లగా మారిపోతోంది. ఈ ప్రాంతంలోని నీరు దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి కూతవేటు దూరంలోనే పర్యాటకులు సైతం నిత్యం సముద్ర స్నానాలు చేస్తుంటారు. ఇలా కాలువల నుంచి వచ్చిన నీరు సముద్రంలో కలవడం వల్ల పర్యాటకులకు చర్మ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశముంది. దీనికి తగిన పరిష్కారం చూపాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగం



బోర్డు నుంచి విద్యుత్ తీసుకుంటూ..



ఆర్కే బీచ్ వద్ద అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఐస్‌క్రీం బండి

ఏయూక్యాంపస్: అత్యంత జనసమ్మర్దంగా ఉండే ప్రాంతంలో యథేశ్ఛగా విద్యుత్ చౌర్యం జరుగుతోంది. నిత్యం ఐస్‌క్రీం బండిలో ఉపయోగించే ఫ్రీజర్లకు విద్యుత్‌ను ఉచితంగా కొట్టేస్తున్నారు. నగరం నడిబొడ్డున సాగర తీరంలో ఇది జరుగుతున్నా.. ఎవ్వరూ కన్నెత్తి చూడటం లేదు. బీచ్ రోడ్డులోని ఆర్కే బీచ్ వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న క్రీం ఫెస్ట్ ఐస్ క్రీం బండిని నిర్వహించే వ్యక్తి పక్కనే ఉన్న జీవీఎంసీ స్టోర్ రూం వద్దనున్న స్విచ్ బోర్డు నుంచి వైర్‌ను కలిపి దర్జాగా విద్యుత్ వినియోగిస్తున్నాడు. ఇంత జరుగుతున్నా అక్కడ టాయిలెట్లను శుభ్రం చేసేవారు, పారిశుధ్య సిబ్బంది, ఇతర సిబ్బందికి ఇది కనిపించడం లేదు. జీవీఎంసీ సిబ్బంది సహకారంతోనే ఇది జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే విధంగా విద్యుత్ వినియోగించడం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది. ప్రస్తుతం గుట్టుచప్పుడు కాకుండా దీనిని పునరావృతం చేస్తున్నారు. నిత్యం ఇలా అక్రమంగా విద్యుత్ వినియోగించడానికి ఎవరు అనుమతిస్తున్నారో అధికారులే నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

బీచ్ రోడ్డులో శునకాల బెడద





ఆర్కే బీచ్ రోడ్డులో వాకర్స్ మధ్యలో సంచరిస్తున్న శునకాలు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో శునకాల బెడద పెరిగిపోతోంది. నిత్యం పదుల సంఖ్యలో శునకాలు దర్శనమిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో బీచ్‌కు వచ్చే సందర్శకులు, వాకర్స్‌ను ఇవి ఇబ్బంది పెడుతున్నాయి. ఉదయాన్నే బీచ్‌లో రన్నింగ్ చేసేవారు ఈ శునకాలను చూసి భయపడుతున్నారు. ఇవి యథేశ్ఛగా ఫుట్‌పాత్‌లపై సంచరిస్తున్నాయి. ఫుట్‌పాత్‌పై కూర్చునే నగరవాసుల పక్కనే ఇవి తిరుగుతుండటంతో చిన్నారులు, మహిళలు భయపడుతున్నారు. ప్రధానంగా వృద్ధులు వీటిని చూసి వాకింగ్‌కు రావాలంటే జంకుతున్నారు. సాయంత్రం వేళల్లో బీచ్‌లో ఉండే వివిధ దుకాణాల్లో మిగిలిన ఆహార పదార్థాలు వీటికి ఆహారంగా దుకాణదారులు వేస్తుంటారు. దీనితో ఇవి బీచ్‌లో సంచరిస్తూ అక్కడ దొరికే ఆహారం తింటూ బతికేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కుక్కలు అరుస్తూ ప్రజలను భయపెడుతున్నాయి.